క్లుప్తంగా

విద్యుత్ స్తంభాల పరిశీలన



స్తంభాలను పరిశీలిస్తున్న అధికారులు

సాక్షి స్పందన

రామగిరి: ఇళ్ల మీదుగా ఉన్న విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి వైరు సరిచేయండి సారూ అని 'సాక్షి'లో శుక్రవారం ప్రచురితమైన కథనానికి ట్రాన్స్‌కో అధికారులు స్పందించారు. మండలంలోని కల్వచర్లలోని కొండిన్యనగర్, శ్మశాన వాటిక, బొమ్మనవేన వీరయ్య వద్ద ఉన్న విద్యుత్ వైర్లు, స్తంభాలను డీఈ ప్రభాకర్, ఏఈ మహేందర్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. స్తంభాలను మార్చడానికి యుద్ధ ప్రతిపాదికన అంచనా విలువను అందజేస్తామన్నారు. అలాగే శ్మశానవాటికలో 11కేవీ విద్యుత్ వైర్లు వేలాడుతున్నాయని గుర్తించి నూతన విద్యుత్ స్తంభం ఏర్పాటు చేసి వైర్లను సరిదిద్దారు. విద్యుత్ స్తంభాలకు సంబంధించి ఎన్ని పోల్స్ అవసరమో అంచనా విలువను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. కల్వచర్ల లైన్‌మెన్ ఆకుల శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ గంట వెంకటరమణారెడ్డి, ఎస్ఎల్ఎం శ్రీనివాస్ ఉన్నారు.

నిబంధనలు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ సంతోష్‌రెడ్డి

జ్యోతినగర్: రోడ్డుభద్రత నియమాలు పాటించండి, ప్రమాదాలను నివారించాలని రామగుండం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కె.సంతోష్‌రెడ్డి అన్నారు. ఎన్టీపీసీ రామగుండంలో జాతీయ భద్రతా మాసోత్సవాల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం చేపట్టిన ఆటోర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ వాహనం నడిపేప్పుడు విధిగా డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలని సూచించారు. లైసెన్స్, సంబంధిత వాహన రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్, పొల్యూషన్ పత్రాలు తప్పకుండా వెంట కలిగి ఉండాలన్నారు. ఆటోలు, ఇతర ప్యాసింజర్ వాహనాలు పరిమితికి ప్రయాణికులను తీసుకెళ్లొద్దని సూచించారు. ర్యాలీ మేడిపల్లి సెంటర్ వరకు కొనసాగింది. ట్రాన్స్‌పోర్ట్ కానిస్టేబుల్ రఘుపతి, హోంగార్డు నజీరోద్దీన్, ఆటోడ్రైవర్లు పాల్గొన్నారు.

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్ జెడ్పీ హైస్కూల్లో కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. ఇండియన్ లిటరసీ ప్రాజెక్టు ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు కెరీర్ గైడ్ కోట కిషోర్‌బాబు అవగాహన కల్పించారు. సైకో మెట్రిక్ ఆక్టివిటీ నిర్వహించారు.

సౌకర్యాల కల్పనలో అధికారులు విఫలం

రామగుండం: రామగుండం కార్పొరేషన్ అధికారులు, ప్రజాప్రతినిధుల పనితీరు బాగులేదని, దీన్ని నిరసిస్తూ మూడురోజుల్లో పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు 22వ డివిజన్ కార్పొరేటర్ కౌశిక లత తెలిపారు. ఈనెల 27తో పదవీ కాలం ముగియనుండగా గడిచిన ఐదేళ్లలో తనకు సహకరించిన డివిజన్ ప్రజలకు కార్పొరేటర్ కృతజ్ఞతలు తెలిపారు. విలేకరుల సమావేశంలో పలు అంశాలు వెల్లడించారు. డివిజన్‌లో కనీస సౌకర్యాల కల్పనలో మున్సిపల్ అధికారుల పనితీరు శూన్యంగా ఉందని ఆరోపించారు.

హెల్మెట్ ధరించాలి

జ్యోతినగర్: వాహనాలపై వెళ్తున్న సమయంలో హెల్మెట్ ధరించాలని ప్రతీ విద్యార్థి తమ తల్లిదండ్రులకు సూచించాలని ట్రాఫిక్ ఎస్సై సంతోష్‌కుమార్ అన్నారు. ఎన్టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్ జెడ్పీ హైస్కూల్‌లో జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం ట్రాఫిక్ అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

రోగికి ఇంటి వద్దే వైద్యం

జ్యోతినగర్: రామగుండం కార్పొరేషన్ రెండో డివిజన్ న్యూపీకే రామయ్యకాలనీకి చెందిన బలీద్ కొన్ని రోజులుగా బోధకాల వ్యాధితో ఇబ్బంది పడుతున్నాడు. సేవా స్ఫూర్తి ఫౌండేషన్ అధ్యక్షుడు, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు మడిపెల్లి మల్లేశ్ డాక్టర్ చంద్రశేఖర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి శుక్రవారం బాధితుడు నివసించే ప్రాంతానికి వచ్చి పరీక్షలు చేశారు. ప్రతీ వారం వైద్య సిబ్బంది సేవలు అందిస్తారని ధైర్యం చెప్పారు. అవసరమైన మందులు అందించారు. బస్తీ దవాఖానా డాక్టర్ నర్మద, స్టాఫ్ నర్సు ఫర్హానా ఉన్నారు.

నిర్ణీత సమయంలో ఇసుక రవాణా చేయాలి

ముత్తారం: ముత్తారం మానేరు నుంచి నిర్ణీత సమయంలో ఇసుక రవాణా చేయలని తహసీల్దార్ సుమన్ ఆదేశించారు. ముత్తారం తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం స్థానిక ఇసుక ట్రాక్టర్ల యాజమానులతో ఆయన మాట్లాడారు. ఈనెల 16 నుంచి ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 5 వరకు ఇసుక రవాణా చేయాలన్నారు. ఎస్సై నరేశ్ ఉన్నారు.

ముక్కోటి ఏకాదశి



కాల్వశ్రీరాంపూర్‌లో ఉత్తరద్వార దర్శనం



యైటింక్లయిన్‌కాలనీ: వేడుకల్లో ఆర్జీ-2 జీఎం వెంకటయ్య



కమాన్‌పూర్: ఆదివరాహస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు

ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకొని శుక్రవారం జిల్లావ్యాప్తంగా వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేంకటేశ్వరస్వామి ఆలయాలతో పాటు పలు ఆలయాల్లో భక్తులు స్వామివారిని ఉత్తరద్వార దర్శనం చేసుకున్నారు. – సాక్షి నెట్‌వర్క్



జూలపల్లి: వేణుగోపాలస్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు



సుల్తానాబాద్: సాంబశివ ఆలయంలో..



జ్యోతినగర్: పూజలు చేస్తున్న భక్తులు



రామగుండం: శ్రీరామపాదక్షేత్రంలో..



సుల్తానాబాద్‌రూరల్: నీరుకుల్లలో దేవతామూర్తులను తీసుకువస్తున్న అర్చకులు



ఫెర్టిలైజర్‌సిటీ: వేంకటేశ్వరస్వామి ఆలయంలో..



రామగిరి: ఉత్తర ద్వార దర్శనంలో శ్రీనుబాబు

రహదారి భద్రత నియమాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సీఐ ప్రవీణ్‌కుమార్

పాలకుర్తి: రహదారిపై ప్రయాణించేటప్పుడు ప్రతీఒక్కరు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని పెద్దపల్లి సీఐ ప్రవీణ్‌కుమార్ అన్నారు. రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కన్నాల టోల్‌ప్లాజా వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. వాహనదారులకు రహదారి భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, వాహనానికి సంబంధించిన పూర్తిస్థాయి పత్రాలు కలిగి ఉండాలని సూచించారు. బసంత్‌నగర్ ఎస్సై స్వామితో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

రహదారిపై గుంతలు పూడ్చివేత



గుంతలు పూడ్చివేయిస్తున్న ఎస్సై స్వామి

పాలకుర్తి: మండల పరిధిలోని ధర్మారం క్రాస్ రోడ్డు నుంచి కుక్కలగూడూర్ వరకు గల ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలను శుక్రవారం పూడ్చివేశారు. బసంత్‌నగర్ విమానాశ్రయం, కొత్తపల్లి బస్టాండ్, రామారావుపల్లి, ఈసాలతక్కళ్ళపల్లి సమ్మక్క–సారలమ్మ జాతర ప్రాంగణం తదితర ప్రాంతాల్లో రహదారిపై ఏర్పడిన గుంతలను బసంత్‌నగర్ ఎస్సై స్వామి తారుతో పూడ్చివేయించారు. గతంలో కూడా బసంత్‌నగర్ విమానాశ్రయం మూలమలుపు వద్ద రోడ్డు ప్రమాదాల నియంత్రణకు స్పీడు బ్రేకర్లు, సైన్‌బోర్డులను, పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఫోర్‌లైన్ రహదారిపై బ్లాక్‌స్పాట్‌లను గుర్తించి బారికేడ్లను ఎస్సై ఏర్పాటు చేయించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు బసంత్‌నగర్ పోలీసులు చేపడుతున్న చర్యలపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

సంక్షిప్త వార్తలు

• నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని ఆకెనపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో పునరుద్ధరణ పనుల దృష్ట్యా శనివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సుమారు పది గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఎన్‌పీడీసీఎల్ ఏఈ ఆశ శంకర్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

కమాన్‌పూర్ పరిధిలో..

కమాన్‌పూర్: కమాన్‌పూర్, రొంపికుంట సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ అశోక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతు పనుల దృష్ట్యా శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. సబ్‌స్టేషన్నల పరిధిలోని కమాన్‌పూర్, జూలపల్లి, గుండారం, నాగారం, రొంపికుంట, పేరపల్లి, పెంచికల్‌పేట, సిద్దిపల్లె, రాజాపూర్ గ్రామాల వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

కాల్వశ్రీరాంపూర్ మండల పరిధిలో..

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్, ఇప్పలపల్లిలో విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతు పనుల దృష్ట్యా ఆయా గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ నిలిపివేస్తామని పేర్కొన్నారు.

• రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

సుల్తానాబాద్‌రూరల్: పట్టణంలోని స్వప్నకాలనీ వద్ద గల రాజీవ్ రాహదారిపై శుక్రవారం కుక్క అడ్డురాగా తప్పించబోయిన వాహనాదారుడు కింద పడగా ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బసంత్‌నగర్‌కు చెందిన రాంపాల్‌మెరియా తన కొడుకు రాజుమెరియాతో కలిసి కరీంనగర్ వెళ్లి వస్తున్నారు. స్వప్నకాలనీ వద్ద కుక్క అడ్డురావడంతో ప్రమాదవశాత్తు కింద పడగా తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108లో సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి కరీంనగర్ తరలించారు.

• కొలనూర్ పాఠశాలకు ప్రహరీ నిర్మించండి

ఓదెల: మండలంలోని కొలనూర్ పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మించాలని గ్రామ పూర్వ విద్యార్థులు జిల్లా విద్యాధికారి మాధవికి శుక్రవారం వినతిపత్రం అందించారు. ఎన్టీపీసీ మాజీ ఉద్యోగి జీగురు అయిలయ్య, సీఆర్‌పీఎఫ్ సీఐ కొదురుపాక రాజేంద్రప్రసాద్, ఎంఈవోలు రమేశ్, రాజన్న ఉన్నారు.

• మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ఓదెల: గంజాయి, మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని పొత్కపల్లి ఎస్సై దికొండ రమేశ్ అన్నారు. మండలంలోని బాయమ్మపల్లిలో శుక్రవారం ఎస్సై గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేశారు.

• అనుమతి పొందిన రీచ్‌ల నుంచే ఇసుక సరఫరా చేయాలి

సుల్తానాబాద్: అనుమతి ఇచ్చిన రెండు ఇసుక రీచ్‌ల నుంచి ఇసుకను నియోజకవర్గ వ్యాప్తంగా తరలించుకోవాలని తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి తెలిపారు. శుక్రవారం మినీ కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.

• చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

గోదావరిఖనిటౌన్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని డీఈవో మాధవి సూచించారు. గోదావరిఖని ఆపిల్ కిడ్స్ స్కూల్ యజమాన్యం స్థానిక జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో శుక్రవారం నిర్వహించిన స్పోర్ట్స్ డే వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. వివిధ క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు మెడల్స్, ప్రశంస పత్రాలు అందజేశారు.

• పాండవుల గుట్టను కాపాడాలి

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్‌లోని పాండవుల గుట్టను కాపాడాలని శుక్రవారం రైతులు, గ్రామస్తులు తహసీల్దార్ ఎండీ వకీల్‌కు వినతిపత్రం అందించారు. మాజీ ఎంపీటీసీ మాదాసు చందు, రైతు సమన్వయ సమితి మాజీ కన్వీనర్ నిదానపురం దేవయ్య, మాజీ ఉప సర్పంచు కరుణాకర్‌రావు, గ్రామస్తులు, రైతులు ఉన్నారు.

• పీహెచ్‌సీ సబ్ సెంటర్ ఆకస్మిక సందర్శన

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని ఆకెనపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సబ్ సెంటర్‌ను శనివారం ఎంపీడీవో ఎంఎ.అలీం ఆకస్మికంగా సందర్శించారు. అనంతరం ఆయన బ్రాహ్మణపల్లిలో పర్యటించారు.

• పాఠశాలల్లో స్వీపర్లను నియమించాలి

రామగుండం: ప్రభుత్వ పాఠశాలల్లో స్వీపర్లు, స్కావెంజర్లను నియమించాలని శనివారం ఆలిండియా ట్రేడ్ యూనియన్ కమిటీ రామగుండం నగర సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అబ్దుల్ కరీం, శనిగరపు చంద్రశేఖర్ మండల విద్యాధికారి గడ్డం చంద్రయ్యకు వినతిపత్రం అందజేశారు.

• ఖబ్రస్థాన్‌లో సమస్యలు పరిష్కరించండి

మంథని: మున్సిపల్ పరిధిలోని ముస్లిం మైనారిటీ ఖబ్రస్థాన్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం కమిటీ చైర్మన్ ఎండీ.ఖాజా మొయినుద్దీన్, కార్యదర్శి సయ్యద్ జహంగీర్ మున్సిపల్ కమిషనర్ మనోహర్‌రెడ్డి, చైర్‌పర్సన్ పెంద్రు రమకు వినతిపత్రం అందించారు. ఖబ్రస్థాన్‌లో సౌకర్యాలు కల్పించాలని కోరారు.

రామగుండం స్కూల్లో ముందస్తు సంబరాలు



వేడుకలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దంపతులు

రామగుండం: రామగుండం హైస్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన ముందస్తు సంక్రాంతి వేడుకల్లో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ఠాకూర్ దంపతులు పాల్గొన్నారు. క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన భోగి మంటలు, హరిదాసుల కీర్తనలు, గాలిపటాలు ఎగురవేయడం తదితర వేడుకలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దంపతులను హెచ్ఎం.శారద సత్కరించారు. ఎమ్మెల్యే సతీమణి మనాలీఠాకూర్, కార్పొరేటర్ కన్నూరి సతీశ్‌కుమార్, స్థానిక మాజీ కౌన్సిలర్ ఇసంపెల్లి అంజలు, మాజీ ఎంపీపీ ఉరిమెట్ల రాజలింగం, బందారపు బుగ్గరాములుగౌడ్, అప్పాసి శ్రీనివాస్, సూర తార ఉన్నారు.

గుండెపోటుతో సింగరేణి కార్మికుడు మృతి

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–1పరిధిలోని జీడీకే–2వ గనిలో పనిచేస్తున్న గొల్లపల్లి నరేశ్(32)అనే కోల్‌కట్టర్ శుక్రవారం తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందాడు. మస్టర్ పడిన కొద్దిసేపటికే ఛాతిలో నొప్పి రావడంతో అక్కడికక్కడే కుప్పకూలాడు. తోటి కార్మికులు గమనించి ఆసుపత్రికి తరలించినా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. అస్వస్థతకు గురైన కార్మికుడిని ఆసుపత్రికి తరలించడంలో ఆలస్యం కావడంతోనే మృతి చెందినట్లు కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. మృతుడి కుటుంబానికి పరిహారం అందజేయాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మృతుడికి ఏడాదిన్నర క్రితమే వివాహం కాగా, యైటింక్లయిన్ కాలనీలో నివాసముంటున్నాడు. మూడేళ్ల క్రితమే తండ్రి ఉద్యోగంలో చేరిన నరేశ్ ఇటీవలే కోల్‌కట్టర్‌గా ప్రమోషన్ పొందాడు.

కార్మికులకు హ్యాండ్ గ్లౌజ్‌లు అందజేత

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–3 పరిధిలోని ఓసీపీ–1 బేస్‌వర్క్ షాప్ సెక్షన్ కార్మికులు, మహిళా కార్మికులకు శుక్రవారం హ్యాండ్ గ్లౌజ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా బేస్‌వర్క్‌షాప్ హెచ్‌వోడీ సత్యనారాయణ మాట్లాడారు. ప్రతీఒక్కరు హ్యాండ్ గ్లౌజ్‌లు ధరించి రక్షణతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఐఎన్టీయూసీ పిట్ సెక్రటరీ నక్క రమేశ్, బ్రాంచ్ సలహాదారులు జక్కుల దామోదర్‌రావు, సెక్షన్ ఇన్‌చార్జి రఘుకుమార్ ఉన్నారు.

రైతులకు సాగునీరు అందించాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు

కమాన్‌పూర్: రైతులు సాగు చేసే పంటలకు సాగునీరు అందించే నీటి విధానంపై మంత్రి స్పష్టత ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ డిమాండ్ చేశారు. మండలంలోని గుండారం రిజార్వయర్‌ను రైతులతో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం సాగునీరు వస్తాయని పంటలు వేస్తే సాగునీరు రాక పంటలు ఎండిపోయాయని, సాగునీటి విషయంలో ఇప్పటివరకు మంత్రి స్పందించలేదన్నారు. యాసంగి సీజన్‌లో సాగునీరు అందించి రైతులను ఆదుకోవాలని కోరారు. మండల కన్వీనర్ తాటికొండ శంకర్, నాయకులు మేకల సంపత్‌యాదవ్, ఉప్పరి శ్రీనివాస్, గుర్రం లక్ష్మీమల్లు, గట్టయ్య, చంద్రమౌళి, శంకర్‌గౌడ్, సింగం శ్రీనివాస్ పాల్గొన్నారు.

సింగరేణి వార్తలు

బ్లాస్టింగ్‌లతో బతకలేకపోతున్నాం



ధర్నా చేస్తున్న నాయకులు

గోదావరిఖని: జీడీకే–5 ఓసీపీ బ్లాస్టింగ్‌ల మూలంగా ఇబ్బంది పడుతున్నామని శుక్రవారం సమీప ప్రాంతాల ప్రజలు ప్రాజెక్టు సైటాఫీస్ ముట్టడికి వెళ్తుండగా సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకోవడంతో గేట్ వద్ద నిరసన తెలిపారు. బ్లాస్టింగ్ సమయంలో గోదావరిఖనిలోని పలు ప్రాంతాల ప్రజలు బతకలేక పోతున్నారని వాపోయారు. యాజమాన్యం పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజలకు చెప్పిన విధంగా నడుచుకోవాలని కోరారు. బ్లాస్టింగ్ తీవ్రత పెంచడంతో గోడలు పగుళ్లు వస్తున్నాయన్నారు. యాజమాన్యం స్పందించి సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో ప్రజలతో కలిసి జీడీకే–5 క్వారీ ముట్టడించి వంటావార్పు చేస్తామని పేర్కొన్నారు. కార్పొరేటర్ బొడ్డు రజిత, నాయకులు రవీందర్, బొబ్బిలి సతీశ్, బాపు, తోడేటి శ్రావణ్, విశ్వరోజు పవన్, గుంశావళి నవీన్, మహేందర్, పవన్, కాజ మియా, కనకయ్య పాల్గొన్నారు.

సింగరేణి మహిళా ఉద్యోగులకు వివిధ హోదా పోస్టులు



ఉద్యోగులతో సమావేశమైన అధికారులు

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–2 పరిధిలో పనిచేస్తున్న మహిళా కార్మికులకు పలు ప్రాంతాల్లో పనిచేసేందుకు డిజిగ్నేషన్ పోస్టులు అందజేశారు. జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో 16 హోదాల్లో 40మందికి పోస్టులు కేటాయించారు. కమిటీ కన్వీనర్ ఎం.రాముడు ఆధ్వర్యంలో ఖాళీలను అనుసరించి సీనియారిటీ ప్రాతిపదికన పోస్టులు అందజేశారు. కమిటీ సభ్యులు మురళీకృష్ణ, ఎస్.అనిల్‌కుమార్, డాక్టర్ మహిపాల్, సంక్షేమాధికారులు రాజు, అజీజ్ మహిళా ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుడి మృతిని గని ప్రమాదంగా గుర్తించాలి



మాట్లాడుతున్న యాదగిరి సత్తయ్య

గోదావరిఖని: స్థానిక జీడీకే–2వ గనిపై గుండెపోటుతో చనిపోయిన సింగరేణి కార్మికుడి మృతిని గని ప్రమాదంగా గుర్తించాలని ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్, బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య, సీఐటీయూ అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి, హెచ్ఎంఎస్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ డిమాండ్ చేశారు. సింగరేణి ఏరియా ఆసుపత్రికి శుక్రవారం చేరుకుని కార్మికుని మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు. అనంతరం ఏరియా ఆసుపత్రిలో మాట్లాడారు. ప్రతీ గనిపై అంబులెన్స్ లేకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. కార్మికుడి మృతికి యాజమాన్యమే బాధ్యత వహించాలని కోరారు. రక్షణ నిబంధనలు పాటిస్తూ ఉత్పత్తి తీయాలన్నారు. అంబులెన్స్ ఆలస్యంగా రావడంతో సకాలంలో సరైన వైద్యం అందక కార్మికుడు మృతి చెందాడని ఆయన ఆరోపించారు. ఈ విషయంలో యాజమాన్యం పూర్తిస్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై చర్య తీసుకోవాలన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి



నివాళి అర్పిస్తున్న దుద్దిళ్ల శ్రీనుబాబు

రామగిరి: యువత చెడు వ్యసనాలకు బానిస కావొద్దని, మానసిక ఉల్లాసం కలిగించే క్రీడల్లో పాల్గొనాలని శ్రీపాద ట్రస్ట్ చైర్మన్ దుద్దిళ్ల శ్రీనుబాబు అన్నారు. మండలంలోని సెంటినరికాలనీ రాణిరుద్రమ దేవి క్రీడా ప్రాంగణంలో డివిజన్ స్థాయి శ్రీపాద స్మారక క్రికెట్ టోర్నీని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ముందుగా శ్రీపాదరావు చిత్రపటానికి ఆర్జీ–3 జీఎం నరేంద్ర సుధాకర్‌రావుతో కలిసి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని సరదాగా కాసేపు క్రికెట్ ఆడారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోట్ల తిరుపతియాదవ్, మండల అధ్యక్షుడు రొడ్డ బాపన్న, మాజీ ఎంపీపీ ఆరెల్లి దేవక్క, మాజీ జెడ్పీటీసీలు గంట వెంకటరమణారెడ్డి, మైదం భారతి, నాయకులు వనం రాంచందర్‌రావు, చొప్పరి సదానందం, తోట చంద్రయ్య, బర్ల శ్రీనివాస్, ముస్త్యాల శ్రీనివాస్, కోట రవీందర్‌రెడ్డి, కొప్పుల గణపతి, కండె పోచం, కాటం సత్యం, బండారు సదానందం, మాదాసు శ్రీనివాస్, దాసరి శివ, రాజ్‌కుమార్, స్వరూప, రజిత పాల్గొన్నారు.

దొంగతుర్తిని మండలంగా ఏర్పాటు చేయాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ధర్మారం: మండలంలోని దొంగతుర్తి గ్రామాన్ని ప్రత్యేక మండలంగా ఏర్పాటు చేయాలని ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్‌కు, కలెక్టర్ కోయ శ్రీహర్షకు శుక్రవారం మాజీ ఎంపీపీ కొడారి అంజన్న ఆధ్వర్యంలో గ్రామస్తులు వినతిపత్రాలు అందించారు. అనంతరం ధర్మారంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎంపీపీ మాట్లాడారు. దొంగతుర్తి గ్రామాన్ని మండలంగా ఏర్పాటు చేయాలని ప్రభుత్వ విప్, కలెక్టర్‌ను కోరగా సానుకూలంగా స్పందించారన్నారు. ధర్మారం మండల కేంద్రానికి 9 గ్రామపంచాయతీలతో పాటు మూడు అనుబంధ గ్రామాలు 13 కిలోమీటర్ల దూరంలో ఉంటాయన్నారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారని వాపోయారు. దొంగతుర్తిలో మండల ఏర్పాటుకు అన్ని రకాల సౌకర్యాలు ఉన్నాయన్నారు. సమావేశంలో దొంగతుర్తి, నర్సింహులపల్లి, రచ్చపల్లి, ఖిలావనపర్తి, రామయ్యపల్లి గ్రామాల ప్రజలు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.



సుల్తానాబాద్ శ్రీవాణి కళాశాలలో..



ధర్మారంలో వేడుకలు



మంథని: ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు



కమాన్‌పూర్: రొంపికుంట ఎంపీపీఎస్ స్కూల్లో

ముందస్తు సంక్రాంతి వేడుకలు

మంథని/సుల్తానాబాద్/ఎలిగేడు/కమాన్‌పూర్/ధర్మారం/రామగిరి/కాల్వశ్రీరాంపూర్/జూలపల్లి: జిల్లాలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో శుక్రవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. భోగి మంటలు, భోగి పండ్లు, రంగవల్లులు వేసి వేడుకలు జరుపుకున్నారు.